సాక్షి
తిరుపతి
ఆదివారం । 29 । సెప్టెంబర్ । 2024



కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు
శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో కట్టుదిట్టంగా భద్రత ఏర్పాటు చేయాలని టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరి ఆదేశించారు. - 8లో



ఎస్వీయూలో తెలుగు సమావేశాలు
ఎస్వీయూ వేదికగా వచ్చే ఏడాది ఫిబ్రవరిలో అంతర్జాతీయ తెలుగు భాషా సమావేశాలు నిర్వహించనున్నారు. - 8లో



పంటలపై గజ దాడులు
పాకాల మండలం పుదిపుట్ల, పేరసానిపల్లెలో పంటలపై ఏనుగులు దాడులు చేసి, ధ్వంసం చేశాయి. - 8లో

న్యూస్‌రీల్

నేడూ కరెంటు బిల్లుల చెల్లింపు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని అన్ని బిల్లుల వసూలు కేంద్రాల్లో ఆదివారం కూడా చెల్లింపులు చేయవచ్చని ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు. ఆదివారం ప్రభుత్వ సెలవు దినం అయినప్పటికీ కరెంటు బిల్లుల వసూలు కేంద్రాలు పని చేస్తాయని పేర్కొన్నారు. హెచ్‌టీ సర్వీసుదారులు పెండింగ్ బిల్లు చెల్లించకపోతే సోమవారం విద్యుత్ సరఫరా ఆపివేస్తామన్నారు.

హిందీ పరీక్షల దరఖాస్తు గడువు పొడిగింపు

తిరుపతి ఎడ్యుకేషన్ : అలహాబాద్‌లోని హిందీ సాహిత్య సమ్మేళన్ యూనివర్సిటీ ఏటా నిర్వహించే హిందీ పరీక్షలకు సంబంధించి దరఖాస్తు చేసుకోవడానికి గడువును పొడిగించినట్లు తిరుపతి ఎమ్మార్‌పల్లెలోని మన సంస్కృతి సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ షేక్ మస్తాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా యూనివర్సిటీ నిర్వహించే మధ్యమ, విశారద్, ఉత్తమ సాహిత్యరత్న పరీక్షలకు రూ.200 ఆలస్య రుసుముతో అక్టోబరు 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మధ్యమ, విశారద్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికి హిందీ పండిట్‌గాను, ఉత్తమ సాహిత్యరత్న ఉత్తీర్ణత అయిన వారు హిందీ జూనియర్ లెక్చరర్ల పోస్టులకు అర్హులన్నారు. పూర్తి వివరాలకు తమ కేంద్రాన్ని సంప్రదించాలని ఆయన కోరారు.

జిల్లా డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా ప్రసాద్



తిరుపతి లీగల్: ఉమ్మడి చిత్తూరు జిల్లా డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా తిరుపతి నాలుగో అదనపు జిల్లా జడ్జి కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గ్రేడ్ వన్ ఎస్‌వీఎల్ ఎన్ఎస్ఆర్‌వీ ప్రసాద్‌ను నియమిస్తూ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవలే ఆయన్ని నెల్లూరు నుంచి తిరుపతికి రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ బదిలీ చేసింది. అలాగే తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి కోర్టు ఇన్‌చార్జి అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 12 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 64,158 మంది స్వామివారిని దర్శించుకోగా 24,938 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. భక్తులు స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.31 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. కాగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తుంది.

క్రీడల్లోనూ రాణించాలి



బహుమతులు అందజేస్తున్న డీఈఓ శేఖర్

తిరుపతి అర్బన్: చదువులతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని డీఈఓ శేఖర్ వెల్లడించారు. తిరుచానూరు జెడ్పీ హైస్కూల్‌లో శనివారం స్వర్ణాంధ్ర 2047ను పురస్కరించుకుని జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీన పాఠశాల స్థాయిలో విద్యార్థులకు, 27న మండల స్థాయిలో, 28న జిల్లా స్థాయిలో వ్యాస రచన, వక్తృత్వ, డిబేట్‌కు సంబంధించి మూడు విభాగాల్లో పోటీలు నిర్వహించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మొదటి బహుమతిగా రూ.700, రెండో బహుమతిగా రూ.500, మూడో బహుమతిగా రూ.300 విలువ చేసే పుస్తకాలను విజేతలకు ప్రదానం చేశారు. తిరుచానూరు హైస్కూలు హెచ్‌ఎం మురళి, ఉపాధ్యాయులు గోపాలకృష్ణ, సారథి, రుక్మాంగద, మధు, రాము తదితరులు పాల్గొన్నారు

స్విమ్స్‌లో కోర్సులకు మూడో విడత కౌన్సెలింగ్

తిరుపతి తుడా: స్విమ్స్‌లో బీఎస్సీ (నర్సింగ్), బీపీటీ, బీఎస్సీ (పారామెడికల్) కోర్సులకు మూడో విడత వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ ఆర్ బిట్లా ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 2 నుంచి 3వ తేదీ వరకు స్విమ్స్ వెబ్ సైట్‌లో పొందు పరిచిన లింకు ద్వారా కోర్సుల ఎంపిక చేసుకోవాలని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీట్ల సంఖ్య, ఫీజు వివరాలు, ఎంపిక విధానం తదితర సమాచారం కోసం స్విమ్స్ అధికారిక వెబ్‌సైట్‌ను వీక్షించాలని కోరారు.

ఎన్నికల వేళ హామీల వర్షం.. ఒక్కటంటే ఒక్క హామీ అమలు చేయలేని చేతకానితనం.. మొత్తంగా వెరసి.. వందరోజుల పాలన విఫలం.. ప్రజలకు ఏమి సమాధానం చెప్పాలో తెలియనితనం.. జనం దృష్టి మార్చాలన్న యత్నం.. కలియుగ వైకుంఠవాసుడు.. అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడి ప్రసాదమైన లడ్డూపై క్షుద్ర రాజకీయం.. అయినా బయట పడిన బాబు డొల్లతనం.. అలాంటి నీచ రాజకీయం చేస్తున్న కూటమి నేతలకు సద్బుద్ధి ప్రసాదించాలని వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్తలు, శ్రేణులు, కార్యకర్తలు, సామాన్య ప్రజలు శనివారం ఊరూవాడా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పలు చోట్ల హోమాలు చేశారు.

బాబుకు సద్బుద్ధి ప్రసాదించు గోవిందా!



తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో కొబ్బరి కాయలు కొడుతున్న టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ శిరిషా, భూమన అభినయ్ తదితరులు

- జిల్లాలోని ప్రధాన ఆలయాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణుల ప్రత్యేక పూజలు
- అసత్య ఆరోపణలతో సీఎం చంద్రబాబు చేసిన పాపం ప్రక్షాళన కావాలని ప్రార్థన
- జగనన్నను అడ్డుకోవడంతో బాబు దైవభక్తి బయటపడిందంటూ ఆగ్రహం
- రాజకీయ కుట్రలతో ఆలయ పవిత్రతకు అపచారమంటూ శ్రీవారికి మొర
- పూజల్లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్తలు, నేతలు

తిరుపతి సిటీ: రాజకీయ కుట్రలే లక్ష్యంగా చలామణి అవుతున్న సీఎం చంద్రబాబుకు కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి సద్బుద్ధిని ప్రసాదించు స్వామీ అని వైఎస్సార్ సీపీ నేతలు, శ్రేణులు వేడుకున్నారు. వైఎస్సార్ సీపీ అధిష్టానం పిలుపు మేరకు జిల్లావ్యాప్తంగా శనివారం అన్ని నియోజకవర్గాలు, మండల కేంద్రాలు, పంచాయతీల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో భూమన, ఎంపీ, ఎమ్మెల్సీ, పార్టీ సమన్వయ కర్త అభినయ్‌రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, కార్పొరేటర్లతో కలిసి 101 కొబ్బరి కాయలు కొట్టి, కర్పూరహారతులిచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో..



వేంకటేశ్వరస్వామికి ప్రీతిపాత్రమైన లడ్డూను అపవిత్రం చేసిన చంద్రబాబు మనస్సు మార్చి, ఆయనకు కనువిప్పు కలిగించాలని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి శ్రీవారిని కోరుకున్నారు. టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న తొండమాన్‌పురంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అభిషేకంతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులను కుట్రపూరితంగా అడ్డుకోవడాన్ని ఆ గోవిందుడు క్షమించరని మండిపడ్డారు. శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, పార్టీ మండల కన్వీనర్లు, పంచాయితీ స్థాయి నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు.

సూళ్లూరుపేట నియోజకవర్గంలో..



భక్తులకు, ప్రజలకు చిత్తశుద్ధితో సేవ చేసే బుద్ధిని చంద్రబాబుకు ప్రసాదించు స్వామీ అంటూ సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పార్టీ శ్రేణులతో కలసి తిమ్మాజీ కండ్రిగలోని శ్రీవారి ఆలయంలో హోమాలు, పూజలు చేశారు. దైవంతో పరాచకాలు ఆడడం ప్రమాదకరమనే విషయం ఆయనకు తెలిసోచ్చేలా శ్రీవారు చంద్రబాబు కళ్లు తెరిపించాలన్నారు. పూజా కార్యక్రమాలలో స్థానిక పార్టీశ్రేణులతో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీవారి లడ్డూపై బాబు కుట్ర రాజకీయం

తిరుపతి కల్చరల్: స్వార్థ రాజకీయాలకు ఎంతటికైనా బరితెగించే చరిత్ర కలిగిన చంద్రబాబు అత్యంత పవిత్రమైన శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కల్తీ అంటూ రాజకీయ కుట్రకు తెరలేపి అసత్య ప్రచారంతో ఆలయ పవిత్రత మంటగలిపారని టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో శనివారం శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో పాప ప్రక్షాళన పూజలు చేసి, 1116 కొబ్బరికాయలు కొట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజకీయ స్వార్థం కోసం బరితెగించే తత్వం కలిగిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. తిరుమల శ్రీవారి పవిత్రపై అపనిందలు వేస్తూ లడ్డూ ప్రసాదంలో నెయ్యికి బదులు జంతువుల కొవ్వు కల్తీ చేశారని నిందలు మోపి, ఆలయ పవిత్ర మంట కలిపేలా వ్యవహరించారన్నారు. తమ హయాంలో ఎలాంటి తప్పు జరగలేదని, బాబు చేసిన ఆరోపణలపై వాస్తవాలు నిగ్గతేల్చడానికి సీబీఐ విచారణ చేయించాలని డిమాండ్ చేశామన్నారు. సీఎం చంద్రబాబు తమ రాజకీయ ప్రాబల్యంతో సిట్‌ను వేయడం విడ్డూరమన్నారు. మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తిరుమల పర్యటనకు వస్తే డిక్లరేషన్‌లో జగన్ సంతకం చేయాలంటూ కూటమి నేతలు వితండ వాదన చేయడం సిగ్గుచేటన్నారు. ఎంపీ డాక్టర్ గురుమూర్తి మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తిరుమల పర్యటనను టీడీపీ నేతలు రాజకీయం చేశారని ఆరోపించారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ దేవుడిపై అసత్య ప్రచారం చేయడం సరికాదన్నారు. మేయర్ డాక్టర్ శిరీష, వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గం సమన్వయకర్త భూమన అభినయరెడ్డి పాల్గొన్నారు.

వెంకటగిరి నియోజకవర్గంలో..



కలియుగదైవానికి రాజకీయ రంగు పులుముతున్న చంద్రబాబుకు మంచి బుద్ధిని ప్రసాదించాలని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. వెంకటగిరి పట్టణంలోని వరదరాజస్వామి ఆలయంలో ఆయన మండల కన్వీనర్లు, పార్టీ శ్రేణులతో కలసి పెద్ద ఎత్తున పూజలు చేశారు. నియోజకవర్గంలోని రాపూరు, డక్కిలి, బాలాయపల్లె మండల కేంద్రాల్లోని ఆలయాల్లో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని, ప్రత్యేక అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. పార్టీ నాయకులు పులి ప్రసాద్‌రెడ్డి, నారాయణరెడ్డి, కార్తీక్‌రెడ్డి, చింతల శ్రీనివాసులరెడ్డి, బాలయ్య, బి లక్ష్మీ, హరి కృష్ణ పాల్గొన్నారు.

గూడూరు నియోజకవర్గంలో..



ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలోని రాజాజీవీధిలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో జగనన్న తిరుమల పర్యటనను అడ్డుకున్న మారని మనిషి బాబుకు సద్బుద్ధిని ప్రసాదించాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై ప్రజలు తిరగబడతారనే భయంతో ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నంలో భాగమే ఈ కుట్ర అన్నారు. పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు, చిట్టమూరు మండల కన్వీనర్ శ్రీనివాసులరెడ్డి, ఎంపీపీ గురవయ్య, సీఈసీ సభ్యులు ధనంజయరెడ్డి, కోట మండల కన్వీనర్ సంపత్‌కుమార్‌రెడ్డి, బత్తిన విజయ కుమార్, సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.

చంద్రగిరి నియోజకవర్గంలో..



శ్రీవారి భక్తుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరుమల పర్యటనకు రాకుండా అడ్డుకోవడంతో బాబు దైవభక్తి ఎంత మాత్రం అన్నది బయట పడిందని చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. కూటమి నాయకులకు మంచి బుద్ధిని ప్రసాదించాలని శనివారం పెరుమాళ్లపల్లెలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నియోజకవర్గ పార్టీ శ్రేణులతో కలసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నియోజకర్గంలోని అన్ని మండలాల కన్వీనర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్యవేడు నియోజకవర్గంలో..

వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయ కర్త నూకతోటి రాజేష్ నారాయణవనం మండలంలోని కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ భక్తుల మనోభావాలతోనూ, దైవంతోనూ రాజకీయాలు చేసి లబ్ధి పొందే కుట్ర చంద్రబాబుకు కొత్తకాదన్నారు. బాబు మనస్సు మార్చాలని నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నామన్నారు.



బాలబాలికల కరాటే జిల్లా జట్ల ఎంపిక



ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికైన ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలబాలికలు

తిరుపతి ఎడ్యుకేషన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్-19 ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలబాలికల కరాటే జట్ల ఎంపిక పోటీలు శనివారం తిరుపతిలో నిర్వహించారు. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి దాదాపు 60 మంది బాలబాలికలు హాజరయ్యారు. బాలబాలికలకు వేర్వేరు బరువు విభాగాల్లో ఎంపిక పోటీలు నిర్వహించారు.

వీరిలో ప్రతిభ కనబరిచిన బాలుర విభాగంలో 11 మంది, బాలికల విభాగంలో ఏడుగురిని జిల్లా జట్లకు ఎంపిక చేశారు. జిల్లా జట్లకు ఎంపికైన బాలబాలికలు రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 పోటీల్లో జిల్లాకు ప్రాతినిథ్యం వహిస్తారని ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి ఎస్.జయరామయ్య తెలిపారు. ఎంపికైన బాలబాలికలను కరాటే మాస్టర్లు రత్నాకర్, వెంకటేశ్వరులు, శివకృష్ణ, సురేష్, సదాశివ, కన్నయ్య, చంద్రశేఖర్, వెంకటసుజిత, భువనేశ్వర్, కుమార్, లోకేష్, కిరణ్, కోచ్‌లు అభినందించారు.

బాలుర విభాగంలో..
ఎం.సుభాష్, జి.ధనుష్, ఎస్.రెడ్డి హితేష్‌రెడ్డి, ఈ.నితేష్, టి.పార్థసారథి, ఎస్.నిఖిల్, ఎం.యోగీశ్వర్, పి.సాయి వెంకటశివ, ఎస్.ధీరజ్, పి.నాగూర్‌వల్లి, డి.రంజిత్‌కుమార్ ఎంపికయ్యారు.

బాలికల విభాగంలో:
బాలికల విభాగంలో డి.రిజ్వాన, టి.మునిసరిత, బి.జాహ్నవి, ఎం.ధాత్రి, వి.భవ్యశ్రీ, బి.జెస్సిక్రిస్టిన, వి.రేవతి ఎంపికయ్యారు.

వీఆర్వోల బదిలీల్లో సిఫార్స్ జోరు

- నిబంధనలు తుంగలో తొక్కి.. నేతల లేఖలకు ప్రాధాన్యం
- 22వ తేదీ ఆర్డర్‌తో 28న జాబితా విడుదల
- జిల్లాలో 242 మంది వీఆర్వోలు బదిలీ
- సచివాలయ ఉద్యోగుల బదిలీలు పెండింగ్

తిరుపతి అర్బన్: వీఆర్వోల బదిలీల్లోను టీడీపీ కూటమి సర్కార్ ఇచ్చిన సిఫార్స్ లేఖలకే అత్యంత ప్రాధాన్యత కల్పించారన్న చర్చసాగుతోంది. సర్కారు నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కారని పలువురు వీఆర్వోలు బాహాటంగానే విమర్శలు చేస్తున్నారు. రూల్స్‌ను చూడకుండా లేఖలే చూశారని పలువురు వీఆర్వోలు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా ఐదేళ్ల సర్వీసు పూర్తి అయిన వీఆర్వోలను ఎట్టిపరిస్థితుల్లోనూ అదే మండలానికి బదిలీ చేయరాదనే నిబంధనలు ఉన్నప్పటికీ వాటినీ పట్టించుకోకుండా అదే మండలంలో పక్క గ్రామంలో పోస్టింగ్ ఇవ్వడంపై పలువురు వీఆర్వోలు తప్పుపడుతున్నారు. మరోవైపు గ్రేడ్-1 వీఆర్వోలను గ్రేడ్-2గాను, గ్రేడ్-2 వీఆర్వోలను గ్రేడ్-1గా మార్పులు చేయడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఆయా నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు ఇచ్చిన సిఫార్స్ లేఖలకే వందశాతం ప్రాధాన్యత కల్పించారని జిల్లా వ్యాప్తంగా వీఆర్వోలు చర్చించుకుంటున్నారు. అలాంటప్పుడు ప్రభుత్వ నిబంధనలు ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు. మీచ్యువల్ పద్ధతిలో ఒకరికొకరు వీఆర్వోల అంగీకారంతో బదిలీ చేయడానికి అవకాశం ఉన్న వాటిని ఏ మాత్రం పట్టించుకోకపోవడంపై పలువురు మండి పడుతున్నారు. ఏకంగా కొందరు వీఆర్వోలు జిల్లా అధికారులకు ఫోన్ చేసి బదిలీల గందరగోళంపై వివరించడంతో లోటుపాట్లు ఉంటే సవరిద్దామని అధికారులు వారికి నచ్చచెప్పే ప్రయత్నాలు చేసినట్లు తెలుస్తోంది. మొత్తంగా వీఆర్వోల బదిలీల్లో గందరగోళం తప్పలేదని అంతా భావిస్తున్నారు.

242 మంది వీఆర్వోలు బదిలీ..
జిల్లాలో ఎట్టకేలకు 242 మంది వీఆర్వోలను బదిలీలు చేశారు. జోన్-4 పరిధిలోని 171 మంది వీఆర్వోలు(తిరుపతితోపాటు చిత్తూరు జిల్లాల నుంచి వచ్చిన మండలాలు), జోన్-3 పరిధిలో 71 మంది (నెల్లూరు జిల్లాల నుంచి తిరుపతికి వచ్చిన మండలాలు)వీఆర్వోలను బదిలీ చేశారు. బదిలీలకు 22తో గడువు ముగిసిన సంగతి తెలిసిందే. అయితే వీఆర్వోల బదిలీల్లో నేతల సిఫార్స్‌లో జాప్యం చోటుచేసుకుంది. దీంతో అధికారులు 22 ఆర్డర్‌తో ఉన్న బదిలీల జాబితాను 28న రాత్రి విడుదల చేశారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీలు 5 తర్వాతే..
ప్రభుత్వం 15 విభాగాల్లో బదిలీలకు అనుమతులు ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పటి వరకు 13 విభాగాల్లో బదిలీల ప్రక్రియ దాదాపుగా పూర్తి చేశారు. వీఆర్వోల బదిలీలు సైతం శనివారం ఇచ్చేశారు. ఇక సచివాలయ ఉద్యోగుల బదిలీల విషయంలో ఆలస్యం తప్పేలాలేదు. సచివాలయ ఉద్యోగుల బదిలీల జాబితాను సిద్ధంగా ఉంచామని, అయితే సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ నేపథ్యంలో అక్టోబర్ 5వ తేదీ తర్వాత వెల్లడిస్తామని జిల్లా అధికారులు చెబుతున్నారు. దీంతో సచివాలయ ఉద్యోగులకు బదిలీలకు నిరీక్షణ తప్పడంలేదు. మొత్తంగా జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల విషయంలో ప్రజాప్రతినిధులు ఆదేశాల మేరకు చేపట్టారని, నిబంధనలు తుంగలో తొక్కారని ఉద్యోగులు బాహాటంగానే విమర్శలు చేస్తున్నారు.

పారదర్శకంగా బదిలీలు



వీఆర్వోల బదిలీలు పారదర్శకంగానే చేశాం. ఐదేళ్ల సర్వీసు పూర్తి అయిన వారికి అదే మండలంలో పోస్టింగ్ ఇవ్వరాదనే రూల్ తహసీల్దార్లకు మాత్రమే. వీఆర్వోలకు కాదు. గ్రేడ్-1 వీఆర్వోలను గ్రేడ్-2గా మార్పు చేయడం కుదరదు. ప్రభుత్వ నిబంధనలు పరిగణలోకి తీసుకున్న తర్వాతే మార్పులు చేపట్టాం.

–పెంచలకిషోర్, జిల్లా రెవెన్యూ అధికారి

పంటలపై గజ దాడులు

పాకాల: మండలంలోని పదిపుట్ల, పేరసానిపల్లె పరిసర ప్రాంతాల్లో పంటలపై ఏనుగుల గుంపు వరుస దాడులు చేస్తూనే ఉన్నాయి. ఇదే క్రమంలో శుక్రవారం రాత్రి పదిపుట్లబైలు పంచాయతీ పుల్లావాండ్లపల్లె గ్రామానికి చెందిన రైతులు వై.నరసింహులు, టి.రామచంద్ర, ఎం.రామకృష్ణ సాగు చేస్తున్న వరి పంటల్లో సుమారు 15 ఏనుగులు పంటలను తొక్కి నాశనం చేశాయి. ఒకటిన్నర ఎకరంలో వరి పంట సాగు చేసిన నరసింహులకు సుమారు రూ.లక్ష, టి.రామచంద్ర ఒక ఎకరానికి సుమారు రూ.70 వేలు, ఎం.రామకృష్ణ ఒకటిన్నర ఎకరాకు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు వాపోయారు.

ప్రత్యేక మెజిస్ట్రేట్ నియామకాలు చేపట్టాలి

తిరుపతి లీగల్: తిరుపతిలోని ప్రత్యేక మెజిస్ట్రేట్ కోర్టుల న్యాయమూర్తుల నియామకాలను వెంటనే చేపట్టాలని న్యాయవాదులు, ప్రజలు కోరుతున్నారు. తిరుపతి అర్బన్ పరిధిలో చిన్నచిన్న కేసులను విచారించి జరిమానాలు విధించడానికి మొదటి ప్రత్యేక మెజిస్ట్రేట్ కోర్టు, తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదయ్యే చిన్నచిన్న కేసులను పరిష్కరించడానికి రెండో ప్రత్యేక మెజిస్ట్రేట్ కోర్టులను ఏర్పాటు చేశారు. అయితే ఆ కోర్టులకు ప్రభుత్వం న్యాయమూర్తుల నియామకం చేపట్టలేదు. మొదటి ప్రత్యేక మెజిస్ట్రేట్ కోర్టుకు తిరుపతి మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఇన్‌చార్జిగా, రెండో ప్రత్యేక మెజిస్ట్రేట్ కోర్టుకు తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఇన్‌చార్జి న్యాయమూర్తులుగా వ్యవహరిస్తున్నారు. వారికి వందలాది కేసులు విచారించాల్సి రావడంతో ప్రత్యేక మెజిస్ట్రేట్ కోర్టుల నిర్వహణ నిర్వహించడం ఇబ్బందికరంగా ఉంటుంది. చిన్న చిన్న కేసుల్లో కోర్టులకు హాజరైన ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు.

పోలేరమ్మ.. మన్నించు తల్లీ

- నవాలక్ష తప్పులతో ముగిసిన జాతర
- ఆది నుంచి అన్నీ తప్పిదాలే
- సామాన్య భక్తులకు నిరాశే
- అధికారులనే అడ్డుకున్న పోలీసులు



క్యూల వద్ద భక్తులు, పోలీసులకు మధ్య తోపులాట (ఫైల్)

వెంకటగిరి (సైదాపురం): పోలేరమ్మ.. మన్నించు తల్లీ అని వేడుకోలేనన్ని తప్పులతో వెంకటగిరి జాతర ముగిసింది. పోలేరమ్మ జాతరలో ఆది నుంచి అన్నీ తప్పిదాలే జరిగాయి. సాక్షాతు దేవాదాయశాఖ మంత్రే జాతర వైఫల్యం జరిగిందంటూ నిర్మొహమాటంగా వెల్లడించడం గమనార్హం. స్థానిక ప్రజాప్రతినిదే తమను మన్నించాలంటూ... క్షమాపణలు కోరడం నిదర్శనం. గత ఏడాది వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలేరమ్మ జాతర అన్నీ హంగులు, ఆర్భాటాలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. అప్పట్లో రెండు రోజులు జరిగే జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించి నేదురుమల్లి పర్యవేక్షణలో గత ఏడాది 5 రోజుల పాటు ప్రతిరోజు పండుగగానే జాతర నిర్వహించారు. ఆ ఏడాదిలోనే సామాన్య భక్తులకు అమ్మవారి దర్శనభాగ్యం అద్భుతంగా జరిగేందుకు వీఐపీ క్యూ దర్శనాలు కూడా పూర్తిగా నిర్మూలించారు. కానీ ఈ ఏడాది సామాన్యులకు అమ్మవారి దర్శనం నిరాశే మిగిలింది.

ఈ ఏడాది తప్పిదాలిలా..

అమ్మవారి జాతర ప్రారంభంలో భాగంగా ప్రధాన ఘట్టమైన ఘటోత్సవంలో గత దశబ్దాలు ఆనవాయితీగా వస్తున్న రాజా కుటుంబీకులు సాంగ్యం, అమ్మవారి బలి దున్నపోతుకు పూజలు ఈ ఏడాది నోచుకోలేదు. వాస్తవానికి అమ్మవారి ఘటం కుండలతోపాటు దున్నపోతును జీనుగుల వారి వీధి నుంచి ఊరేగిస్తూ రాజాగారి వంటశాల వద్ద రాజాలు పంపిన సాంగ్యంతో తొలుత పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది జరిగిన ఘటోత్సవంలో రాజాగారి వంట శాల వద్దకు పోలేరమ్మతల్లి దున్నపోతును తీసుకురాకపోవడంతో అక్కడ దున్నపోతు ప్రత్యేక పూజలకు నోచుకోలేదు.

జాతర విఫలమైందని అధికారులపై మండిపాటు

తమ తప్పిదాలను తప్పించేందుకు ప్రజా ప్రతినిధులు జాతర వైఫల్యం చెందిందంటూ మండిపడడంపై ప్రజలు అసహ్యాయించుకుంటుకున్నారు. పదేళ్లపాటు వెంకటగిరిని శాసించిన ఓ ప్రజాప్రతినిధి నాలుగేళ్లపాటు పాలించిన మరో ప్రజాప్రతినిధి దగ్గరుండి పర్యవేక్షించినా జాతరలో సామాన్య భక్తులకు దర్శనం కల్పించడంలో విఫలమయ్యారు. ఈ నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి విచ్చేసిన దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జాతర వైఫల్యమైందంటూ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కూడా జాతరలో పొరపాట్లు జరిగాయంటూ బహిరంగంగా ఒప్పుకోవడం గమనార్హం.

వైఫల్యాలపై సోషల్ మీడియాలో వీడియోలు హల్‌చల్

టీడీపీ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన పోలేరమ్మ జాతరలో జరిగిన పలు సంఘటనలు వైఫల్యాలు చెందాయంటూ స్థానిక యువతీ, యువకులు సోషల్ మీడియాలో పలు వీడియోలు వైరల్ చేశారు. ప్రజా ప్రతినిధులకు, పోలీసులకు మధ్య దర్శన అనుమతి విషయమై వివాదం చెలరేగింది. సాక్షాత్తు పోలేరమ్మ దేవస్థానం ఈఓను పోలీసులు నెట్టివేయడంతో పలు విమర్శలకు తావిస్తోంది.

దర్శనంలో వీఐపీలకే అధిక ప్రాధాన్యత

ఈ ఏడాది స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో ప్రత్యేక వీఐపీ దర్శన క్యూ ఏర్పాటు చేయడంతో రూ.300, రూ.100 టికెట్లను కొనుగోలు చేసిన భక్తులకు మాత్రం అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు. అధికారులు, ప్రజాప్రతినిధుల హంగామాతోనే అమ్మవారి దర్శనాన్ని సక్రమంగా దర్శించుకోలేకపోయామంటూ పలువురు భక్తులు వాపోయారు.

జానపదం అంటే జన పథం



గోపూజలో పాల్గొన్న ఆచార్య చిగిచెర్ల కృష్ణారెడ్డి

శ్రీసిటీ(సత్యవేడు): 'జానపదం అంటే జనపథం. ఈ జనపదానికి పుట్టినిల్లు పల్లెటూళ్లు. ఆ పల్లెల్లోని జనం నోట తరతరాలుగా అలవోకగా వస్తున్న పదాలు, పాటలే జానపద గేయాలు, సామెతలు, పొడుపు కథలు, గేయాలు, కథలు, వాద్యాలు, తిట్లు ఇవవన్నీ జానపద సాహిత్యంలో భాగం. నృత్యాలు ఇందులో అంతర్భాగం.' అని విశ్రాంత అధ్యాపకులు ఆచార్య చిగిచెర్ల కృష్ణారెడ్డి అన్నారు. శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో స్థానిక బిజినెస్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన జానపద సంస్కృతి, కళలపై సాగిన చిగిచెర్ల కృష్ణారెడ్డి ప్రసంగం శ్రోతలను ఆకట్టుకుంది.

గోపూజల మహోత్సవం

జానపద కళలపై ప్రత్యేక కార్యక్రమంతోపాటు పెరటాశి రెండో శనివారం ప్రాశస్త్యం దృష్ట్యా శ్రీసిటీ శ్రీవాణి ఆధ్వర్యంలో శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోపూజ మహోత్సవం నిర్వహించారు. శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, చిగిచెర్ల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు

తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. తిరుమల అన్నమయ్య భవనంలో శనివారం తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్‌ఓ శ్రీధర్‌తో కలిసి అదనపు ఈఓ భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా దర్శనం, వాహనసేవలు జరిగేలా చూడాలని టీటీడీ, పోలీసు ఉన్నతాధికారులను అదనపు ఈఓ కోరారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, అలాంటివి పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. గరుడసేవ రోజు ఎటువంటి ఇబ్బంది లేకుండా గ్యాలరీలకు అన్నప్రసాదాలు చేరేలా చూడాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ తదితర అంశాల్లో టీటీడీ భద్రత, జిల్లా పోలీసులు పరస్పరం సమన్వయం చేసుకోవాలన్నారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఏర్పాట్లు, కార్యక్రమాలను నిశితంగా పర్యవేక్షించడానికి ముఖ్యమైన అధికారులతో ప్రత్యేకమైన వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో జేఈఓ వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, రవాణా విభాగం జీఎం శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేబిస్ దినోత్సవం

తిరుపతి తుడా: తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి ఆధ్వర్యంలో రుయా ఆస్పత్రి ప్రాంగణంలో ప్రపంచ రేబీస్ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌ఓ డాక్టర్ హరిత, డీఎంఓ డాక్టర్ రూప్ కుమార్, డాక్టర్ లావణ్య, బాబు నెహ్రూ పాల్గొన్నారు.

2న విశ్వంలో అవగాహన సదస్సు

తిరుపతి ఎడ్యుకేషన్ : 2025–26 విద్యా సంవత్సరంలో మిలటరీ, సైనిక్ స్కూళ్ల ప్రవేశ పరీక్షలకు సంబంధించి తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం టాలెంట్ స్కూలులో అక్టోబరు 2వ తేదీ అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ఆ మేరకు శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రీయ మిలిటరీ స్కూల్స్, సైనిక్ స్కూల్ 6, 9వ తరగతిలో ప్రవేశాలకు జాతీయస్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్షకు సంబంధించి ఏర్పాటు చేస్తున్న అవగాహన సదస్సుకు 5 నుంచి 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరుకావచ్చన్నారు. ఆయా పరీక్షలకు సంబంధించి వివరాలు తెలుసుకోవడంతోపాటు సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

ప్రొఫెసర్ సజ్జన్‌రెడ్డికి అరుదైన గౌరవం



తిరుపతి సిటీ: జాతీయ వినూత్న పథకంలో పరిశోధన సలహా మండలి సభ్యునిగా వెటర్నరీ వర్సిటీ ప్రొఫెసర్ కాపా సజ్జన్‌రెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. ఈ మేరకు కేంద్రం నుంచి ఆయనకు ఉత్తర్వులు అందాయి. గతంలో ఆయనకు పరిశోధన, విస్తరణ సంచాలకులుగా పనిచేసిన అనుభవం ఉంది. సలహా మండలి వినూత్న పరిశోధన అంశాల రూపకల్పన, పరిశోధన, ఆచరణలో అవసరమైన సలహాలను ఇవ్వనుంది. దేశంలోని వివిధ పరిశోధన సంస్థల నుంచి ఎంపికైన ఎనిమిది మంది సభ్యుల్లో తనకు చోటు దక్కడం ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. పశుపోషణ, పశువైద్య విభాగంలో నూతన సాంకేతిక అంశాల పురోగతికి ఈ అవకాశం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

ఎస్వీయూలో తెలుగు భాషా సమావేశాలు

తిరుపతి సిటీ: ఎస్వీయూ వేదికగా తెలుగు విభాగం, ప్రాచ్య పరిశోధనా సంస్థ (ఓఆర్‌ఐ), తెలుగు సంపద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మూడో అంతర్జాతీయ తెలుగుభాషా సమావేశాలు వచ్చే ఏడాది ఫిబ్రవరి 27, 28వ తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు సమావేశాలకు అవసరమైన ఏర్పాట్లపై శనివారం వీసీ సీహెచ్ అప్పారావుతో తెలుగు విభాగాధిపతి రాజేశ్వరమ్మ, ఓఆర్‌ఐ సంచాలకులు ప్రొఫెసర్ పీసీ వేంకటేశ్వర్లు, తెలుగు సంపద సంస్థ ప్రధాన సలహాదారు డాక్టర్ రేమిళ్ల మూర్తి సమావేశమై చర్చించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ సమావేశాల్లో పలు యూనివర్సిటీలు, కాలేజీలు, పరిశోధనా సంస్థలకు చెందిన అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొననున్నారు. తెలుగు భాషా సాహిత్య అంశాలపై నిపుణుల ప్రసంగాలు, పరిశోధనా పత్రాల సమర్పణ వంటి కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టనున్నారు.

ఎస్వీయూలో నిపుణుల కమిటీ సమావేశం

ఏపీ ఉన్నత విద్యామండలి నిపుణుల త్రిసభ్య కమిటీ శనివారం ఎస్వీయూను సందర్శించి వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిటీ జాతీయ, అంతర్జాతీయ ర్యాంకింగ్‌ను మెరుగుపరచుకోవడానికి పలు సూచనలు చేసింది. ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్ సాధించిన టాప్ వర్సిటీల స్థితిగతులపై విశ్లేషణ చేసింది. వర్సిటీ బలం, బలహీనతలు, లోపాల గుర్తించి సరిచేసుకోవడం వంటి విషయాలపై కమిటీ చర్చించింది. టీచింగ్, లెర్నింగ్, రిసోర్సెస్, రీసెర్చ్ అండ్ ప్రొఫెషనల్ ప్రాక్టీస్, గ్రాడ్యుయేట్ ఫలితాలు, అవుట్‌రీచ్, తదితర అంశాలపై దృష్టి సారించాలని సూచించింది. సమావేశంలో కమిటీ సభ్యులు డాక్టర్ అబ్దుల్ హక్, ఉర్దూ వర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ఫజుల్ రెహమాన్, కోయంబత్తూరు భారతీయార్ వర్సిటీ ఐక్యూఏసీ డైరెక్టర్ ఓ సంగీత, వారణాసి బనారస్ హిందూ వర్సిటీ ఎన్‌ఐఆర్‌ఎఫ్ కోఆర్డినేటర్ భాస్కర్ భట్టాచార్య ఉన్నారు.



చర్చిస్తున్న వీసీ, ఎన్‌ఐఆర్‌ఎఫ్ కమిటీ సభ్యులు

రాపూరు ఘాట్‌లో లారీ బోల్తా

రాపూరు: రాపూరు–చిట్వేలి మార్గం మధ్యలో శనివారం వాటర్ బాటిళ్ల తీసుకెళుతున్న లారీ రోడ్డుపై బోల్తా పడింది. ఆయిల్ ట్యాంకు నుంచి పొగలు రావడంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని అదుపు చేశారు. రాపూరు అగ్నిమాపక అధికారి కుప్పయ్య కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా రాజంపేట నుంచి నెల్లూరు జిల్లా కావలికి వాటర్ బాటిళ్లతో ఓ లారీ బయలుదేరింది. రాపూరు నుంచి 16వ కిలోమీటర్ వద్ద లారీ బ్రేక్‌లు ఫెయిల్ కావడంతో అదుపుతప్పి రోడ్డుపై బోల్తా పడింది. లారీ ఆయిల్ ట్యాంకు నుంచి పొగలు రావడంతో డ్రైవర్ హరిప్రసాద్, క్లీనర్ లక్ష్మయ్య అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందించారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని, మంటలను అదుపు చేశారు.



రాపూరు ఘాట్‌లో బోల్తా పడిన లారీ నుంచి వస్తున్న పొగలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

